క్లుప్తంగా

హనుమాన్ ఆలయ కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలోని హనుమాన్ ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూస రవికుమార్, ఉపాధ్యక్షుడుగా నీల్గొండ సూరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎరుకల రాజ్‌కుమార్, సభ్యులుగా ఉప్పుల దేవేందర్, కొనుకటి రాజు, నవీన్, మహేందర్, కూస శ్రీను, మధు, సాయిలు, రాజేశ్, రాజేందర్, శేఖర్, శ్రీను, మహేందర్, సుదర్శన్, రాజు, సురేశ్, అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కార్యవర్గ సభ్యులు అభినందించారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు ఎంపిక



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి మాలోతు సాగర్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. స్కూల్ ఆవరణలో సాగర్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడారు. నవంబర్‌లో దేశవ్యాప్తంగా జరిగిన పరీక్షలో సాగర్ ప్రతిభ చాటి ఎంపికయ్యాడని తెలిపారు. సాగర్‌కు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనుందని చెప్పారు. సాగర్ ప్రతిభ చాటేలా ప్రోత్సహించారంటూ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

నెక్కొండ : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న షాపు వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన తాళ్లూరి నర్సింహస్వామి తన ద్విచక్ర వాహనాన్ని రోజు మాదిరిగానే షాపు ఎదుట పార్క్ చేశాడు. తెల్లవారు జామున చూడగా బైక్ కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్టు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లికి చెందిన నల్లతీగల ఉప్పలయ్య (70) శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.4 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లతీగల రవి, రాజేంద్రప్రసాద్, నల్లతీగల శివ, లక్ష్మణ్, రాజబాబు, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల అందజేత



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన మంత్రించు నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం 25 కేజీల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మడిపెద్ది నాగార్జున్, వైస్‌చైర్మన్ బండి రాజు, సభ్యులు గజవెల్లి నాగరాజు, మడిపెద్ది నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



తొర్రూరు: జీవిత ప్రయాణంలో నిత్యం బిజీగా ఉండే భట్రాజు కులస్తులు వృత్తి జీవితాన్ని కాసేపు పక్కన పెట్టి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన భట్రాజు కుల ఆత్మీయ సమ్మేళనంలో 6తరాలకు చెందిన 141 కుటుంబాలు కలుసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్‌రాజు, ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గూడూరు: మండల కేంద్రంలోని మేరుగు భరత్ సౌండ్స్ అండ్ డెకరేషన్ గోదాం ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే మురళీనాయక్ డెకరేషన్ యజమాని భరత్‌గౌడ్, రవీందర్‌గౌడ్‌లను ప్రమాద ఘటన విషయం అడిగి తెల్సుకున్నారు. సహాయ సహకారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న పాల్గొన్నారు.

బీటీ రోడ్డు గుంతలమయం

- క్రషర్లు, రెడిమిక్స్ వాహనాలతోనే..
- ప్రమాదాలు.. పలువురికి గాయాలు
- అధికారుల నిర్లక్ష్యం



గాంధీనగర్ వద్ద బీటీ రోడ్డుపై గుంతలు

సంగెం : మండలంలోని ఊకల్ గ్రామం నుంచి తొర్రూరు దిశగా నిర్మించిన డబుల్ రోడ్డు గాంధీనగర్ వద్ద గుంతలమయమైంది. సమీపంలోని క్రషర్లు, రెడిమిక్స్ ప్లాంట్లకు రాకపోకలు సాగించే వాహనాల వల్లే సుమారు 200 మీటర్లకు పైగా బీటీ రోడ్డు పూర్తిగా గుంతలు పడింది. ఈ ప్రాంతంలో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురికి గాయాలయ్యాయి. అయినా సమస్య పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ అధికారులపై వాహనచోదకులు, మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఊకల్ నుంచి తొర్రూరు వరకు నిర్మించిన డబుల్ రోడ్డు మార్గమధ్యలో పలుచోట్ల గుంతలు పడ్డాయి. కాగా ఆర్ అండ్ బీ అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నారు. అయినా ఈ రోడ్డులోని గాంధీనగర్ వద్ద సుమారు 200 మీటర్లకుపైగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు పడింది. ఈ దారి మీదుగా నిత్యం ద్విచక్ర వాహనాలపై, కార్లు, ఆటోల్లో వ్యాపారస్తులు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండడం పరిపాటి. ప్రతిరోజూ రాకపోకలు సాగించే వారు సైతం ప్రమాదాల బారిన పడుతుండగా ఇక ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై రాకపోకలు సాగించే క్రమంలో గుంతల విషయం గమనించక సడెన్‌గా బ్రేకులు వేసి గుంతల్లో పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. గాంధీనగర్ వద్ద ఉన్న క్రషర్లు, రెడిమిక్స్ ప్లాంట్ల నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాల వల్లే రోడ్డు గుంతలమయమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డులోని పలు ప్రాంతాల్లోని గుంతలకు ఆర్ అండ్ బీ అధికారులు వెనువెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు. అయితే గాంధీనగర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పెద్ద సైజులోని గుంతలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో అప్పుడప్పుడు క్రషర్ యాజమాన్యాలు దుమ్ము లేవకుండా నీళ్లు చల్లి చేతులు దులుపుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రయాణికుల పాలిట ప్రాణసంకటంగా మారిన ఈ బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

బీటీ డబుల్ రోడ్డు నిర్మించిన అనతి కాలంలోనే ఇక్కడి క్రషర్, రెడీమిక్స్ ప్లాంట్ల నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాల వల్ల గుంతలు ఏర్పడ్డాయి. వాటిని అలాగే వదిలి వేయడం వల్ల గుంతలు మరింత పెద్దవిగా మారి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు, క్రషర్ల యాజమాన్యాలు చొరవ చూపించాలి. సీసీ రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

- ఇస్మాయిల్, కార్యదర్శి, ఎంసీపీఐ(యూ)

పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం

గాంధీనగర్ వద్ద గుంతలమయంగా మారిన బీటీ రోడ్డును త్వరలో ప్రత్యక్షంగా పరిశీలిస్తాం. గుంతలు తేలడానికి గల కారణాలపై అధ్యయనం చేస్తా. రోడ్డు గుంతలమయం కావడానికి గల కారణాలను గుర్తిస్తాం. సమస్యను ప్రభుత్వ, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గుంతలు పూడ్చేలా రోడ్డు నిర్మాణానికి చొరవ తీసుకుంటాం. తద్వారా గుంతల వద్ద ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.

- షఫీయుద్దీన్, ఏఈ, ఆర్ అండ్ బీ

జీవితంలో వ్యక్తిత్వ వికాసం కీలకం

- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చెన్నారావుపేట : జీవితంలో వ్యక్తిత్వ వికాసం కీలకమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. మండలంలోని అమీనాబాద్‌లోని ఆ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే పట్టుదలతోపాటు ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని తెలిపారు. చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరమని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సుధాకర్, రవి, మహేందర్, మౌలాలీ, యాకయ్య, రాము, అర్జున్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



ఏకేతండాలో తలపై బోనంతో ఆలయానికి వస్తున్న ఝాన్సీరెడ్డి, భక్తులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

రాయపర్తి : గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని ఏకేతండాలో ఆదివారం నిర్వహించిన బొడ్రాయి, దుర్గమ్మ పండుగలతోపాట హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. దైవ సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో బోనాలు, దుర్గమ్మ, తదితర పండుగల నిర్వహణతో సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

నర్సంపేట : సూర్య షొటో ఖాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నర్సంపేట గ్లోబల్ షొటో ఖాన్ ఇండియా మినీ స్టేడియం విద్యార్థులు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. నర్సంపేటకు చెందిన విద్యార్థులు ఆర్.విఘ్నేశ్, అశ్రఫ్, సాయిదీప్తి, హన్సిక, హర్షవర్ధన్, శ్రీవర్షిత్ 14, 12 ఏళ్ల బాలబాలికల కటాస్ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే 11, 9, 6 ఏళ్ల బాలబలికల కటాస్ విభాగంలో స్నిగ్ధ నయన్, వైదిక్, నిహంత్ పటేల్ వెండి పతకాలు సాధించగా శ్రీవన్, హన్విక, దేవాన్ష్ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ షేక్ జానీ, మాస్టర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మాస్టర్ మహేశ్‌లను సూర్య అకాడమీ ఆర్గనైజర్ పాయం సురేశ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థులను మదర్స్ ల్యాండ్ హైస్కూల్ చైర్మన్ రమేశ్, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌రావు, గ్లోబ్ షొటో ఖాన్ ఇండియా ఫౌండర్ మాస్టర్ వెంకటేశం అభినందించారు.

'ఉపాధి'లో జల సంరక్షణకు ప్రాధాన్యం



రైతు నిర్మించిన ఫాంపాండ్

నర్సంపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం జలసంరక్షణపై దృష్టి సారించింది. వర్షపు నీరు వృథాగా పోకుండా పనులు చేపడుతోంది. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటూ రైతులను ప్రోత్సహిస్తోంది. తద్వారా బోర్లు, బావులు రీచార్జ్ కావడంతోపాటు కుంటల్లోని నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభంలో పంట పొలాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. క్రమంగా ఈ పథకం కేవలం కూలీలకు ఉపాధి కల్పించేలా తయారైంది. ఇందిర జలప్రభ, జలశక్తి అభియాన్ పథకాలు చేపట్టినా వంద శాతం అమలు కాలేదు. ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేసినా అవసరమైన జల సంరక్షణ పనులు చేపట్టలేకపోయారు. జల సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కేంద్రం నిర్ణయించింది.

చేపట్టే పనులు..

- చేతిపంపులు, ఇళ్ల వద్ద సామూహిక, వ్యక్తిగత ఇంకుడు గుంతలు తీస్తారు.
- ఇంటిపై భాగంలో నిలిచిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపడుతున్నారు.
- సాగునీటి కాల్వాలను సరిచేస్తారు. నీటి నిల్వ కుంటలను ఏర్పాటు చేస్తారు.
- అవసరమైన చోట చిన్న కందకాలు, చిన్న కుంటల నిర్మాణం చేపడుతారు.

నీటిని ఒడిసి పట్టేలా..



ఉపాధి హామీ పథకంలో కూలీ లకు పనులు కల్పించడంలో భాగంగా జల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వర్షపు నీరు, ఇతర నీటిని ఒడిసి పట్టేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. వీటితో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రోత్సహిస్తున్నాం.

- కౌసల్యాదేవి, డీఆర్‌డీఓ



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కార్యదర్శి

ఫర్టిలైజర్ డీలర్ల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్ల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని వరంగల్, హనుమకొండ జిల్లాల అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్‌లో వరంగల్ డిస్ట్రిక్ట్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగరాజు అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సభ్యుల సమస్యల పరిష్కారంతోపాటు భవనానికి ప్రతినెలా ఆదాయం వచ్చేలా చూస్తానని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా నాగుర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గౌరిశెట్టి నాగరాజు, కోశాధికారిగా నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అరుంధతి పరమేశ్వర్, పున్నమి రాజేందర్‌రెడ్డి, సరస్వతి, రమేష్, ఆకుల హరేందర్, యామిని వెంకట్రావు, కిసాన్ సత్యనారాయణ రెడ్డి, గాయపు రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ లాహోటి, పల్లె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ నేరం

రాయపర్తి : గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని ఎస్సై శ్రవణ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని బాల్‌నాయక్‌తండా పరిధిలోని లంబాతండాలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. భూక్య వినోద గుడుంబా తయారు చేస్తుండగా ఆమెపై కేసు నమోదు చేసి 5 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు 5 లీటర్ల గుడుంబా, 2 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వినోదపై కేసు నమోదు చేశామన్నారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సింగారపు ఎల్లయ్య, తూళ్ల సంపత్, మధు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ యువజన చైతన్యమే ధ్యేయం

- మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్



మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్

చెన్నారావుపేట : ముదిరాజ్ యువజనాన్ని చైతన్యవంతం చేయడమే ధ్యేయంగా 'పల్లె పల్లెకు మెపా' కార్యక్రమం చేపట్టినట్టు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. మండలంలోని లింగగిరిలో ఆదివారం నిర్వహించిన 'పల్లె పల్లెకు..' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, ఉద్యోగం, సాధికారతపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. భవిష్యత్‌లో అన్ని గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. ముదిరాజ్ కులస్తులు ఇక నుంచి జన్మించే పిల్లలకు పేరు చివర ముదిరాజ్ అని చేర్చాలని కోరారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, తదితర అన్ని రంగాల్లోనూ ఎదిగే దిశగా కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తాడెం వినయ్, తాడెం రాంచంద్రు, అశోక్, రాంచంద్రు, రాజు, కట్టమల్లు, నాగమల్లు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యాభ్యాసానికి అవకాశం

ఖిలా వరంగల్ : ఈనెల 4న వరంగల్ ఉర్సుగుట్ట వద్దగల తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో జెన్, గ్లోబల్ స్టడీ అడ్వైజర్ (యూఎస్‌ఏ–ఆధారిత) సహకారంతో నిర్వహించనున్న అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2025కు 11 దేశాల విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరుకానున్నారని కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, టర్కీ, మలేషియా, ఐర్లాండ్, ఫ్రాన్స్, కెనడా, ఇటలీ, స్కాట్లాండ్, జర్మనీ వంటి ప్రతిష్టాత్మక దేశాలతోపాటు 30పైగా విదేశీ విశ్వవిద్యాలయాలు ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఖిలా వరంగల్ : మధ్యకోట రోడ్డులోని వాకింగ్ మైదానంలో మెడికేర్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్డియా స్పెషలిస్ట్ డాక్టర్ భగీరథ్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ భగీరథ్ వాకర్స్‌కు గుండె పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో బోగి సురేష్, చింతం మోహన్‌సాయి, సిబ్బంది ఆశ, సందీప్, రాజు, రాణి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై హర్షం

ఖిలా వరంగల్ : మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై హర్షంవ్యక్తం చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో వరంగల్ కరీమాబాద్‌లో ఆదివారం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరై ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 15నెలల క్రితం వరంగల్‌కు ప్రధాని మోదీ వచ్చిన సందర్భంలో మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణపై వినతిపత్రం అందజేసి అభ్యర్థించానని గుర్తుచేశారు. ఈ మేరకు రూ.450 కోట్ల నిధులు కేటాయిస్తూ విమానాశ్రయం పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, ఆకుతోట రాజు, వాసుదేవ్, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న సస్పెన్షన్ సరికాదు'

ఆత్మకూరు : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ అన్నారు. మండలంలోని నాగయ్యపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే మల్లన్నను సస్పెండ్ చేశారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గిన్నారపు రాజు, మాదాసి సుధాకర్, గిన్నారపు శ్రీకాంత్, మాదాసి రాజు, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి జాతర

గంగారం : మండలంలోని మడగూడెం గ్రామంలోని యాప వారి ఇలవేల్పు అయిన సీదలమ్మ జాతర ఈనెల 22, 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వహన కమిటీ బాధ్యులు తలపతి యాప శ్రీను, సీమ కుమారులు యాప ముత్తమ్మలు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జాతర కరపత్రాలను ఆవిష్కరించారు.

4న కేయూలో స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్ : ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న కాకతీయ యూనివర్సిటీలోని మ్యాథమెటిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రొఫెసర్ జనార్దన్‌రావు స్మారకోపన్యాసం నిర్వహించున్నట్లు జనార్దన్‌రావు ట్రస్ట్ కార్యదర్శి బుచ్చి బాబురావు తెలిపారు. తెలంగాణ ఆఫ్టర్ ఏ డికేడ్ ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సినారియోస్ అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

ఆత్మకూరు : ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఎంలలో విద్యార్థుల బలవన్మరణాలకు పాల్పడడం బాధాకరమని, వాటిపై విచారణ చేపట్టాలని ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా కన్వీనర్ మైదం రవి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మరణాలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చుక్క రత్నాకర్, యేసెఫ్, బొంకూరి రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్

కేయూ క్యాంపస్ : వరంగల్ నగరానికి చెందిన బాటనీ అధ్యాపకురాలు లక్కాకుల విశాలకు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈనెల 1న న్యూఢిల్లీలోని మయూర్ విహార్‌లో విశాలకు యూనివర్సిటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్ అందజేశారు. విశాల 12 ఏళ్లు బాటనీ సబ్జెక్టును అతిథి అధ్యాపకురాలుగా బోధించారు. విశాల వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కార్యక్రమాలు నిర్వహించారు. విశాలను సంస్థ చైర్మన్ డాక్టర్ రామానుజస్వామి, అధ్యాపకులు, ప్రతినిధులు విశాలను అభినందించారు.